చినుకు.. వణుకు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంత వాసులు గజగజలాడుతున్నారు. దుర్గానగర్, ఎస్సార్‌కాలనీ, శ్రీనాథపురం, కాకరలోవ, చింతల్లోవ, క్రాంతినగర్, ఇందిరానగర్‌చ లక్ష్మీనగర్ ఎఫ్‌బ్లాక్ వంటి ప్రాంతాల్లో వర్షాలకు కొండ చరియలు విరిగి పడుతుండడంతో ఏ క్షణం ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు.


గతంలో 59వ వార్డులో వర్షాలకు కూలిన ఓ ఇంటి గోడ

- వర్షాలకు భీతిల్లుతున్న కొండవాలు ప్రాంత ప్రజలు
- కలగానే మిగులుతున్న రక్షణ గోడల నిర్మాణం
- చర్యలు తీసుకోవాలని ప్రజల వినతి



92వ వార్డు ఇందిరానగర్‌లో వర్షాలకు గురువారం అర్ధరాత్రి కూలిన ప్రహరీ

సింథియా: అధికారులు, ప్రజా ప్రతినిధుల మాటలు కోటలు దాటుతున్నా... ఆచరణ మాత్రం గుమ్మం దాటడం లేదని కొండవాలు ప్రాంత ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఎన్‌ఏడీతో పాటు పారిశ్రామిక ప్రాంతంలోని కొండవాలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడ్డాయి. మూడు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆ సమయంలో పర్యటించిన కూటమి ప్రజాప్రతినిధులు కొండవాలు ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపడతామని.. తక్షణమే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు తగ్గిన తర్వాత వాటి సంగతి మరిచిపోయారు. ఇక రామకృష్ణా నగర్‌లో పనులు ప్రారంభించినా నత్తనడకన సాగుతున్నాయి.

ఇదీ పరిస్థితి : జీవీఎంసీ 59, 60, 61, 62, 63 వార్డుల్లో దాదాపు లక్షన్నర మంది జీవిస్తున్నారు. ఇందులో అధికశాతం నిరుపేదలే ఉండడంతో అద్దె తక్కువ ఉంటుందని కొండవాలు ప్రాంతాల్లో ఎక్కువగా నివాసముంటున్నారు. సాధారణ వర్షాలు పడినా మట్టి పెళ్లలు విరిగి ఇళ్లపై పడడం, ఇళ్లకు వెళ్లడానికి మెట్లు లేక జారి పడడం వంటి ఘటనలు జరుగుతున్నాయి.రక్షణ గోడలు లేక బండరాళ్లు దొర్లడం, విషసర్పాలు, క్రిమికీటకాలు ఇళ్లలోకి ప్రవేశించడంతో భయభ్రాంతులకు గురవుతున్నారు.

వర్షాలతో బేజారు

తాజాగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండవాలు ప్రాంత ప్రజలు భయపడుతున్నారు. బండరాళ్లు జారడం... మట్టి పడడంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని కలవరపడుతున్నారు. తాజాగా 92వ వార్డులోని ఇందిరానగర్‌లో ఓ ఇంటి ప్రహరీ, 90వ వార్డు పరిధి లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గం కూలిపోయింది.


62వ వార్డులో రక్షణ గోడలు లేని కొండవాలు ప్రాంతం

ఇందిరా నగర్‌లో కూలిన ప్రహరీ

గోపాలపట్నం: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 92వ వార్డు ఇందిరానగర్‌లో ఓ ఇంటి ప్రహరీ కూలిపోయింది. గురువారం అర్ధ రాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఉదయం స్థానికులు జీవీఎంసీ అధికారులకు సమాచారమందించారు. స్పందించిన అధికారులు కూలిపోయిన వ్యర్థాలను తొలగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గణబాబు ఘటనా స్థలానికి చేరుకుని పలు సూచనలు చేశారు. ఏఎంహెచ్‌వో డాక్టర్ అప్పలనాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి మట్టిచెరియలు తొలగించే పనులు సమీక్షించారు.


గోడకూలిన ఇంటి వద్ద అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

వెంటాడుతున్న గత అనుభవాలు

గతంలో కురిసిన భారీ వర్షాలకు 59వ వార్డులో గణపతినగర్ కొండపై ఓ ఇంటిపై బండరాళ్లు దొర్లిపడడంతో మూడేళ్ల బాలుడితో పాటు గర్భిణి మృతి చెందారు. ఆ సంఘటనను పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఇంకా మరువలేదు.

- మిచాంగ్ తుపాను ప్రభావంతో ఎడతెరిపిలేకుండా కురిసిన భారీ వర్షానికి జీవీఎంసీ 59వ వార్డు ములగాడ మండలం ఎక్స్ సర్వీస్‌మెన్‌కాలనీలోమట్టి జారిపోయి అన్సర్‌అలీ ఇల్లు నేలకూలింది. జీవీఎంసీ 61వ వార్డు పరిధి రజకవీధిలో మల్లరాము అనే నిరుపేదకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు నేలకూలింది.


గతంలో కురిసిన వర్షాలకు కూలిన పెంకుటిల్లు (ఫైల్)

విరిగిపడిన కొండచరియలు

విశాఖ విద్య: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 90వ వార్డు కొండవాలు ప్రాంతమైన లక్ష్మీ నగర్ ఫ్ బ్లాక్ సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. కొండవాలు ప్రాంత ఇళ్లకు వెళ్లే రహదారిపై కూలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న జోనల్ కమిషనర్ హైమావతి శుక్రవారం కార్పొరేటర్ బొమ్మిడి రమణతో కలసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. కొండవాలు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. తుపాను తగ్గేంత వరకు కొండవాలు ప్రాంతానికి చెందిన వారికి లక్ష్మీ నగర్ ఎఫ్ బ్లాక్ స్కూల్లో వసతి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు.


లక్ష్మీనగర్ కొండవాలు ప్రాంతంలో పరిశీలిస్తున్న జెడ్సీ, కార్పొరేటర్

భయంగా ఉంటుంది



సాధారణ రోజుల్లో ఎలా ఉన్న వర్షాలు పడేటప్పుడు కంటి మీద కునుకు ఉండడం లేదు. విషసర్పాలు ఇళ్లలోకి చేరడం, వర్షపునీరు లోనికి రావడంతో పాటు బండరాళ్లు వచ్చి ఎక్కడ ఇంటిమీద పడతాయోనని భయంగా ఉంటుంది. ప్రభుత్వం చొరవ తీసుకుని రక్షణ గోడలు నిర్మించి పేదల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– అప్పలరాజు, 63వ వార్డు

రక్షణ గోడలు నిర్మించాలి



వానోస్తే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంటుంది. పగలంతా కష్టపడి పనిచేసి ఇంటికి వచ్చిన తమకు రాత్రి పూట వర్షం వస్తే నిద్రపట్టడం లేదు. గతంలో అధికారులు వచ్చి రాళ్లు పడకుంగా రక్షణగోడలు నిర్మిస్తామన్నారు. ఇంకా నిర్మించలేదు. దీంతో మళ్లీ బండరాళ్లు దొర్లుతున్నాయి. ప్రభుత్వంస్పందించి రక్షణ గోడల నిర్మాణం చేపట్టాలి.

– సావిత్రి, 62వ వార్డు

క్లుప్తంగా

నేవీ ఉద్యోగి అదృశ్యం


అదృశ్యమైన నేవీ ఉద్యోగి విరాట్

మల్కాపురం: ఓ నేవీ ఉద్యోగి అదృశ్యం అయ్యాడు. దీంతో అధికారులు మల్కాపురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ఉత్తరప్రదేశ్ ప్రాంత వాసి అయిన విరాట్‌చౌదరి ఇండియన్ నేవీలో ఈఆర్‌ఏ విభాగంలో కొంత కాలం నుంచి పని చేస్తున్నాడు. డాక్‌యార్డ్ వద్ద గల నేవల్ ఏరియాలో ఓ యుద్ధనౌకలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నాడు. అయితే రోజూ విధులకు వచ్చే విరాట్ ఈ నెల 4వ తేదీ ఉదయం 8 గంటల నుంచి కనిపించడం లేదు. దీంతో నేవీ అధికారులు విరాట్ తన సొంత ఊరు వెళ్లి ఉంటాడని అక్కడ విచారణ చేపట్టారు. ఫలితం లేకపోవడంతో మల్కాపురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.

సెయింట్ ఆన్స్ కళాశాలలో నేడు క్రిస్మస్ వేడుకలు

మల్కాపురం: కిస్మస్ వేడుకల్లో భాగంగా శనివారం మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మేరీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమకుమారి తెలిపారు.ఈ సందర్భంగా వేదిక విద్యార్థినులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలువురు అతిథులు హాజరుకానున్నట్లు చెప్పారు.

నేడు సామాజిక భవనం ప్రారంభం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పరిధి శ్రీరామ్‌నగర్‌లో సుమారు రూ.15 లక్షల జీవీఎంసీ నిధులతో నిర్మించిన సామాజిక భవనాన్ని శనివారం ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి అతిథులుగా ఎమ్మెల్యే పి.గణబాబు, నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య హాజరవుతారని అధికారులు తెలిపారు. శ్రీరామ్‌నగర్ ప్రాంతంలో సామాజిక భవనం కార్పొరేటర్ లావణ్య కృషితో వచ్చిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

28 నుంచి సీపీఎం జిల్లా మహాసభలు

మల్కాపురం: ఈ నెల 28,29 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మల్కాపురం జోన్ నాయకుడు పైడిరాజు అన్నారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం 61వ వార్డు వెంకన్నపాలెం లోని సీపీఎం కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28న ఉదయం 10 గంటలకు పెందుర్తి జూనియర్ కళాశాల నుంచి సుజాతనగర్ వరకు భారీ ప్రదర్శన ఉంటుందన్నారు. అనంతరం సుజాతనగర్‌లో మహాసభలు ప్రారంభం అవుతాయని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులు పాల్గొని మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో సంతృప్తికర జీవనం

విశాఖ విద్య: సంతృప్తికరమైన జీవనం సాగించేలా ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని స్వామి పార్థసారధి శిష్యురాలు, ప్రవచనకర్త సుశీలాజీ పేర్కొన్నారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏయూలోని వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో భగవద్గీత 10వ అధ్యాయం 'విభూతి యోగం' మీద ఇంగ్లిష్‌లో ఐదు రోజుల జ్ఞాన యజ్ఞం (ప్రవచనాలు) కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతోంది. మూడో రోజు శుక్రవారం ప్రవచనాలు చెప్పారు. శ్రీకృష్ణుడి వివిధ రుపాల్లో ఉన్న అంతులేని దివ్య మహిమలను తెలిపారు. జీవులన్నీ తనలోనే పుట్టి, తనలోనే జీవించి, తనలోనే ఐక్యమవుతాయని శ్రీకృష్ణుడు చెప్పారని వివరించారు. బంగారు ఆభరణాలకు ఏ విధంగా బంగారం మూలమో.. ఆత్మ అన్ని వస్తువులు, ప్రాణులకు మూలమని పేర్కొన్నారు. ముందుగా భజన కీర్తనలు ఆలపించారు. స్వామీ పార్థసారధి వివిధ అంశాలపై రచించిన పుస్తకాలను ప్రదర్శించారు. ప్రచనాలకు విచ్చేసిన వారంతా పుస్తక ప్రదర్శనను తిలకించారు. వేదాంత ఇన్‌స్టిట్యూట్ ట్రస్ట్ సభ్యులు, విద్యార్థులు, నగర వాసులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్ జన్మదిన వేడుకలకు ఏర్పాట్లు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించడానికి పారిశ్రామిక ప్రాంతంలో ఏర్పాట్లు చేశారు. పలు వార్డుల్లో ఆయా వార్డుల కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు వేడుకలను నిర్వహించనున్నారు.దీనిలో భాగంగా 58వ వార్డు పిలకవానిపాలెంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య ఆధ్వర్యంలో కేక్ కటింగ్,నిరుపేద మహిళలకు చీరలు పంపిణీ చేయనున్నారు.

- ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ రఫ్ గేటు వద్ద జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకులను నిర్వహించనున్నారు.
- 59వ వార్డు లేబర్ జంక్షన్ వద్ద వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో జగన్మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నారు.

కార్మికుల సమస్యలపై రాజీలేని పోరాటం

వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్


సమావేశానికి హాజరైన కార్మికులు

మల్కాపురం: కార్మిక సమస్యలపై రాజీలేని పోరాటం సాగిస్తానని.. పారిశ్రామిక ప్రాంతంలోని నిరుద్యోగులకు పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా అడుగులు వేస్తానని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ అన్నారు. వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ సభ్యులు,కార్మికులతో శుక్రవారం పిలకవానిపాలెంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ),కోరమాండల్,షిప్‌యార్డ్,డాక్‌యార్డ్,ఎస్‌బీసీ తదితర సంస్థల్లో స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా హెచ్‌పీసీఎల్‌లో స్థానికేతర కార్మికులే అధికంగా ఉన్నారని ఆరోపించారు. పరిశ్రమల్లో స్థానికులకు 70 శాతం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఆదేశాలు ఉన్నా ఆయా సంస్థలు, కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. ఆత్మీయ సమావేశానికి అతిథులుగా పాల్గొన్న 40,60,62వ వార్డుల కార్పొరేటర్‌లు గుండపు నాగేశ్వరరావు,పి.వి.సురేష్,బల్లా లక్ష్మణరావు,59వ వార్డు పార్టీ అధ్యక్షుడు రేవళ్ల సత్యనారాయణ మాట్లాడుతూ కార్మిక సమస్యలపై అనిల్‌కుమార్‌కు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ కార్యకర్తలు,కార్మికులు పాల్గొన్నారు.

పదిహేనేళ్ల తర్వాత కుటుంబం చెంతకు


వృద్ధుడిని షెల్టర్‌కు తీసుకొస్తున్న మమత(ఫైల్)


కుటుంబ సభ్యుల చెంతకు చేరిన వృద్ధుడు

విశాఖ విద్య: ఇంటి నుంచి వచ్చేసిన వృద్ధుడు పదిహేనేళ్లకు తిరిగి కుటుంబం చెంతకు చేరాడు. నాలుగు నెలల కిందట ఫుట్ పాత్ మీద మానసిక పరిస్థితి బాగోలేక తిరుగుతున్న కాశీరాంను బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. అంతే కాకుండా కాశీరాంకు మానసిక హాస్పటల్‌లో వైద్యం అందించి కోలుకున్న తర్వాత తన కుటుంబ సభ్యులు వివరాలు ఆరా తీశారు. ఉత్తర ప్రదేశ్‌లోని బహాలోల్పూర్ గ్రామం అని తన వివరాలు చెప్పడంతో జీవీఎంసీ కమిషనర్ సూచనల మేరకు షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత శ్రద్ధా ఫౌండేషన్ వారి సహాయంతో కాశీరాంను వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పగించారు. 15 సంవత్సరాల కిందట తప్పిపోయిన కాశీరాంను తమకు అప్పగించినందుకు వారి కుటుంబ సభ్యులు జీవీఎంసీ షెల్టర్ మేనేజర్ మమతతో పాటు శ్రద్ధా ఫౌండేషన్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

మల్కాపురం: జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలోని లక్కీ అమర్ పాఠశాల ఆవరణలో మెగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ వాసుదేవరావు తెలిపారు. సుమారు 200 మంది వరకు దాతలు రక్తదానం చేయనున్నారని పేర్కొన్నారు. ప్రతి ఏటా డిసెంబర్ 22వ తేదీన ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసుదేవరావు తెలిపారు.

వాన.. హైరానా


వర్షంతో గొడుగులను ఆశ్రయించిన విద్యార్థులు


వర్షం అయినా తప్పదు ప్రయాణం

- స్తంభించిన జనజీవనం
- మూత పడినఫుట్‌పాత్ దుకాణాలు

మల్కాపురం/గోపాలపట్నం: మూడు రోజుల నుంచి తెరిపిలేకుండా కురుస్తున్న వర్షానికి పారిశ్రామిక ప్రాంతం తడిసి ముద్దయింది.పలు చోట్ల రోడ్డుపై నీరు నిలిచింది. కాలువలు పొంగిపొర్లాయి.ఏకధాటిగా చిరుజల్లులు కురవడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయింది. ఫుట్‌పాత్ వ్యాపారులు దుకాణాలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు రోజులుగా వ్యాపారాలు సాగడం లేదని.. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి ఉంటే ఇబ్బందులు తప్పవని నిర్మాణరంగ కూలీలు, ఫుట్‌పాత్ వ్యాపారులు వాపోతున్నారు. చాలా వరకు ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. అసలే శీతాకాలం.. ఆపై చలిగాలులు తోడవడంతో వృద్ధులు, చిన్నారులు వణికి పోయారు. గోపాలపట్నం, ఎన్‌ఏడీ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి.తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వచ్చిన వారు గొడుగులు, రెయిన్ కోట్లు ధరించారు. కాలం కాని కాలంలో ఇదేమి వానరా బాబూ అంటూ పరుగులు తీశారు.


వర్షం కారణంగా పోర్టు క్వార్టర్స్ వద్ద మూసివేసిన దుకాణాలు


మూతపడిన మల్కాపురం సబ్‌స్టేషన్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న దుకాణాలు


మరిడిమాంబ కల్యాణ మండపం వద్ద సామగ్రి తడవకుండా కప్పిన టార్పాలిన్


గోపాలపట్నంలో మూసి వేసిన తోపుడుబళ్లు

డ్రగ్స్ రహిత క్యాంపస్‌గా ఏయూ

వీసీ ఆచార్య జి.శశిభూషణరావు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని మత్తు పదార్థాల రహితంగా తీర్చిదిద్దుతున్నామని వీసీ ఆచార్య జి.శశిభూషణరావు అన్నారు. ఉన్నత విద్యా మండలి సంయుక్తంగా సంబంధ్ హెల్త్ ఫౌండేషన్‌తో శుక్రవారం నిర్వహించిన వర్చువల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల పర్యవసానాలు, నష్టాలను విద్యార్థులకు వివరించడం, వారిని వీటికి దూరంగా ఉంచడం నిరంతర ప్రక్రియగా కార్యక్రమాలను జరుపుతున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పిలుపును స్వీకరిస్తూ డ్రగ్స్ రహితంగా ఏయూను తయారు చేస్తున్నామని చెప్పారు. సంబంధ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఆషిమా సలీం మాట్లాడుతూ విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో నోడల్ అధికారులను ఏర్పాటు చేయాలని, వారికి తమ సంస్థ తరఫున ప్రత్యేక శిక్షణ అందిస్తామన్నారు. నోడల్ ఆఫీసర్లు విద్యార్థుల్లో అవగాహన కలిగించడం, పోస్టర్ తయారీ వ్యాసరచన పోటీలో నిర్వహించడం, అవగాహన ర్యాలీలు, సిగ్నేచర్ క్యాంపెయిన్ వంటివి చేపట్టాలని సూచించారు. డ్రగ్ కంట్రోల్ చాంపియన్‌గా యువతను గుర్తించి వారి ద్వారా సమాజంలో విస్తృతమైన చైతన్యం తీసుకురావాలని కోరారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ప్రిన్సిపాల్ ఆచార్య కె.సీతామాణిక్యం, ఎ.నరసింహారావు, అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఆచార్య ఎస్.హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.